బండి మలుపుతిరిగి నూకాలమ్మగుడి కనిపించగానే రాధగుండెలు ఒక్కసారి కొట్టుకున్నాయి. ఇంకొక మలుపు తిరగగానే తనకి చిరపరిచితమైన ఇళ్లూ, వ్యక్తులూ, గతుకులబాట వెంబడి మందంగా సాగుతున్నా రాధకి బండి వేగంగా పోతున్నట్టే అనిపించింది. ఆరాటపడే హృదయాన్ని ఎంత అణచిపెట్ట ప్రయత్నించినా వ్యర్థమే అయింది.

నాల్గు సంవత్సరాల అనంతరం స్వగ్రామానికి వస్తున్న ఆనందం రాధహృదయంలో లవలేశమైనా లేదు. దాని మనస్సు నిండా అనేక సంశయాలూ, భయాలూ.

ఇన్ని యేళ్ళకి తిరిగి వస్తున్న తన్ని చూచి అన్నయ్య ఆదరిస్తాడా? వదిన చేరదీస్తుందా? అన్నయ్య తన్ను క్షమించినా, క్షమించకపోయినా తన తప్పిదంమాత్రం సామాన్యమైనది కాదు.

తనకి పరిచితమైన ఆ ప్రదేశాన్ని చూడగానే రాధమనస్సు గతంలోని అనేక స్మృతుల్ని నెమరు వేసుకోసాగింది.

అన్నయ్య తన్ను ప్రాణంగా చూసుకొనేవాడు. వదిన తనంటే యిష్టంలేకపోయినా అన్నయ్యకి భయపడి తన్ను ఏమీ అనేదికాదు.

ఆ వూళ్లో అందరూ తన్ను ప్రేమించేవారు. చిన్న వయస్సులో తనకి కల్గిన దౌర్భాగ్యానికి జాలిపడేవారు.

అన్నయ్య తన్నుచూచి కంట తడిపెట్టేవాడు. తల్లీ తండ్రీ లేకపోయినా అన్నయ్య ఆదరణలో తనకు ఆ లోటు కనిపించలేదు.

అటువంటి అన్నయ్య ప్రతిష్ఠనీ, గౌరవాన్నీ మంటగలిపి నాలుగేళ్ళక్రితం తను వెళ్ళిపోయింది. నిష్కళంకమైన వంశానికి యింత మసిపూసి మాయమయింది. మళ్ళీ యింతకాలానికి మానినగాయాన్ని రేపటానికి తిరిగివస్తున్నది.

తను వెళ్ళిపోయిన నాటిరాత్రి యివేమీ ఆలోచించలేదు. ఒక క్షణిక దౌర్బల్యానికి తను లొంగిపోయింది. తన్ను ప్రాణానికి ప్రాణంగా చూసుకొనే అన్నయ్య ఆనాడు జ్ఞప్తికిరాలేదు. తనకళ్ళకి అంత మైకం కమ్మటానికి కారణం ఎవరు?

మూర్తి! అవును. మూర్తే తన హృదయంలో విషంనింపాడు. ఆనాడు తనకి హితుడుగా కనిపించాడు. అతనిమాటలే తనకి వేదవాక్కులుగా వినిపించాయి. తన దౌర్భాగ్య జీవితాన్ని సుఖమయంచేస్తాడని నమ్మింది.

కాని చివరికి జరిగిందేమిటి? తన్ను సర్వనాశనంచేసి చివరికి చెప్పకుండా వెళ్ళిపోయాడు.

చివరికి, అన్నివిధాల తను భ్రష్టురాలు అయినతర్వాత మళ్ళీ అన్నయ్యే కనిపించాడు.

మూర్తి వెళ్ళిపోయాక తను ఏవిధంగానూ అన్నయ్యకి ముఖం చూపించలేననుకుంది. తనవంటి పతితజీవితానికి మరణమే శరణ్యమనుకుంది.

కాని, అన్నయ్యనీ, స్వగ్రామాన్నీ చూడాలనేకోరికను అణచుకోలేకపోయింది. అందువల్లనే సిగ్గునూ, సంకోచాన్నీ అణచిపెట్టి మళ్ళీ తిరిగిరావటానికి సిద్ధపడింది.

"ఎవరింటికి వెళ్ళాలి? అమ్మగారూ!" అన్న బండివాని ప్రశ్న రాధ మనస్సులోని ఆలోచనల్ని చెదరగొట్టింది.

*************************

## ఊపిరింపు ఆనందం

*************************

బండి ఊళ్లో ప్రవేశించింది. చీకటి పడటం మూలంగా తన్ను ఎవరూ గుర్తించలేదు. అంతవరకూ అదృష్టమే.

"అదిగో! అదే! ఆ గాంధీబొమ్మకెదురుగా నున్న ఎత్తరుగుల యిల్లు. అక్కడ ఆపు చెయ్యి." రాధ వణుకుతున్న కంఠంతో చెప్పింది.

బండి గుమ్మందగ్గర ఆగగానే రాధ గుండెలు కూడా ఒక్కసారి ఆగినట్టు అనిపించింది.

బండిలోని సామాను అరుగుమీద దించి, డబ్బులు తీసుకుని బండివాడు వెళ్ళిపోగానే రాధ యింట్లో అడుగు పెట్టింది.

తను పుట్టి పెరిగిన ఆయింటిని చూడగానే రాధకి దుఃఖం ఉబికి వచ్చింది. పొంగివచ్చే కన్నీటిని ఆపుకుని లోపల అడుగు పెట్టింది.

"ఎవరువారు?" అంటూనే మేడదిగి వస్తున్న సీతయ్య రాధని చూడగానే బావురుమన్నాడు.

గందరగోళం విని బైటికి వచ్చిన రాజ్యలక్ష్మి సావిట్లో రాధని చూడగానే నిశ్చేష్టయై నిలబడిపోయింది. కొద్దిసేపు అలాగే నిలబడి తర్వాత తలవంచుకొని లోపలికి వెళ్ళిపోయింది.

రాధ ఆమెను అనుసరించబోయి మళ్ళీ సంకోచంతో అక్కడే నిలబడిపోయింది.

కళ్లు తుడుచుకుంటూ నిలబడిన సీతయ్యని చూడగానే రాధకళ్ళల్లో నీళ్లు తిరిగినై. సీతయ్య! ఈసీతయ్య చేతులలోనే తను పెరిగి పెద్దదయింది.

"మేడమీదకు పద తల్లీ! సామాను నీగదిలో పెడతాను" అంటూ కళ్ళు ఒత్తుకుంటూ సీతయ్య సామాను తేవటానికి బైటికివెళ్ళి పోయాడు.

"ఈ ముసలివాడు నన్ను క్షమించాడు" అనుకుంది రాధ మనస్సులో.

మేడమీద పూర్వం తనుండేగదిలోకి ప్రవేశించగానే రాధ ఏడుపుని దిగమింగుకోలేకపోయింది. ఈ గదిలోనే తను బాల్యంనించి యౌవనం వరకూ అనేక సంవత్సరాల నిర్మల జీవితం గడిపింది. ఆ స్మృతులు చితులై ఆమె హృదయాన్ని దహించి వేయసాగినై. కుర్చీలో కూలబడి రెండు చేతులలోనూ ముఖాన్ని కప్పుకొని వెక్కి వెక్కి ఏడ్చింది.

"రాధమ్మా"

రాధ తలఎత్తి చూచింది. సామానులోపల పెట్టి సీతయ్య ఎదురుగా నుంచున్నాడు.

"సీతయ్యా" అంటూనే మళ్లీ వెక్కి వెక్కి ఏడ్చింది.

సీతయ్య కన్నీటిని తువ్వాలుతో మాటిమాటికీ తుడుచుకుంటూ నుంచున్నాడు.

రాధ దుఃఖాన్ని దిగమింగుకుని "అన్నయ్య ఏడి, సీతయ్యా" అని అడిగింది.

"ఎక్కడికో వెళ్ళారమ్మా" అని సీతయ్య క్షణంసేపు వూరుకుని "ఏవన్నయ్యమ్మా! ఆబాబును చూస్తే గుండె చెరువైపోతున్నాది. పైకి ఏమీ కనిపించడు కానీ నీకోసం ఆయన ఎంత కుమిలిపోతున్నాడో? అట్టాంటి అన్నయ్యని వదిలి ఎక్కడికెళ్ళావమ్మా?" అన్నాడు.

రాధ మౌనంగా ఆలోచిస్తూ కూర్చుండిపోయింది. కొద్దిసేపటికి మెల్లగా "అన్నయ్య నేను చచ్చిపోయానని అనుకోలేదా సీతయ్యా?" అని అడిగింది.

సీతయ్య బిగ్గరగా ఏడుస్తూ "అట్టాంటి మాట లనకమ్మా" అన్నాడు.

రాధ నిశ్చలంగా శూన్యంలోకి చూస్తూ "నిజంగా రాధమ్మ చచ్చిపోయింది సీతయ్యా!" అంది.

సీతయ్య చెవులు మూసుకుని "నేను వినలేనమ్మా రాధమ్మతల్లీ!" అని ఏడుస్తూనే బైటికి వెళ్ళిపోయాడు.

సీతయ్య వెళ్ళిపోగానే రాధకి మళ్ళీ

ఒక్కసారి బిగ్గరగా ఏడవా లనిపించింది. కాని యీ వేళ తన ఏడుపుకి విలువేమీ లేదు.

రాధ కుర్చీలోనించి పైకిలేచి కిటికీ తలుపులు తెరిచింది. కిటికీలోనించి ఆ గ్రామమంతా కనిపిస్తుంది. పూర్వం యీకిటికీలోనించి క్రిందికి చూస్తూ గంటలతరబడి గడిపేది. కాని, యీ వేళ నిద్రాముద్రితమై ఆగ్రామదృశ్య ఆమె హృదయంలో కలవరం రేపుతోంది.

ఎదురుగా కనిపించే మేడ చూడగానే రాధ ఒక్కసారి ఉలిక్కిపడింది. తను ఎప్పుడూ ఆమేడ కిటికీకేసే చూసేది. ఆకిటికీలోనించే మూర్తి తనమీద అస్త్రాన్ని ప్రయోగించింది. దాని పర్యవసానమే ఈ వేళటి తన స్థితి. రాధ కిటికీతలుపులు మూసివేసింది.

క్రింద రాజ్యలక్ష్మి కంఠం రాధని మళ్ళీ యీలోకంలోనికి తీసుకొనివచ్చింది.

"మీ ముద్దులచెల్లెలు వచ్చింది. పైకివెళ్ళి పలకరించలేదేం?" వదినకంఠం వినిపించింది.

"రాధ వచ్చిందా?" ఆశ్చర్యంతో కూడిన అన్నయ్య కంఠం వినిపించిది.

"ఆ! వెళ్ళి పరామర్శించండి" వదిన వ్యంగ్య బాణం విసిరింది.

"నోర్ముయ్యి" అని అన్నయ్య గదమాయింపు.

సంభాషణ అంతటితో ఆగిపోయింది. రాధగుండెలు దడదడ కొట్టుకోసాగినై. అన్నయ్యకి తనముఖం ఎలా చూపెంచగలదు.?

నిలుచున్నపళంగా తను చచ్చిపోతే బాగుండు ననిపించింది. తన పాపిష్ఠి ముఖం చూసి అన్నయ్య క్షమిస్తాడా?

"రాధా" ప్రేమ పూరితమైన అన్నయ్య గద్గద స్వరం వినగానే రాధ వుక్కిరిబిక్కిరయింది. అన్నయ్యముఖం చూడలేకపోయింది.

"అన్నయ్యా" అంటూ అతని పాదాల వద్ద కూర్చుండి పోయింది.


"చెల్లాయీ" అంటూ ఆమె తల నిమిరి కళ్ళు తుడుచుకుంటూ బైటకి వెళ్ళిపోయాడు.

రాధ వెక్కుతూ అలాగే కూర్చుండిపోయింది.

సీతయ్య అన్నం తీసుకునివచ్చి పలకరించే వరకూ రాధ అలాగే కూర్చుండి పోయింది. సీతయ్య దగ్గరకివచ్చి తల నిమురుతూ "అన్నం తీసుకువచ్చాను. తిని పడుక్కో తల్లీ! పొద్దుపోయింది" అన్నాడు.

రాధ పైటచెంగుతో కన్నీళ్ళు తుడుచుకుంటూ

"సీతయ్యా! అన్నయ్య నన్ను క్షమించాడా?" అని అడిగింది.



విద్యుద్దీపాలతో ప్రకాశించే సెంట్రల్ స్టేషను.
—ఫొటో: వి. కేశవశర్మ.

సీతయ్య కొద్దిగా నవ్వుతూ "పిచ్చితల్లీ! ఆయన అందరి లాంటి వాడు కాదమ్మ" అన్నాడు.

రాధకళ్ళు సంతృప్తితో మెరిశాయి

"నా కాకలి కావటం లేదు సీతయ్యా!" అంది. సీతయ్య ఆతురతపడుతూ "అట్లా కాదమ్మా. కొద్దిగా ఎంగిలిపడు. ఎప్పుడనగా తిన్నావో" అన్నాడు.

రాధ యింకేమీ మాట్లాడకుండా భోజనం ముగించింది. సీతయ్య కంచం తీసుకుని వెళ్ళిపోయాడు.

రాధ హృదయం యిప్పుడు తేలికపడింది అన్నయ్య తన్ను క్షమించాడు. తన కింకేమీ అవసరం లేదు.

వదిన తను యిక్కడకి వచ్చినదగ్గరనించీ ఒక్కసారి కూడ యిటు తొంగి చూడలేదు భోజనం పైకి పంపించటంలోని భావంకూడా తనకి బాగానే అర్థమయింది. అన్నయ్య క్షమించాడన్న ఆనందంలో వదిన చేసిన యీ సత్కారం తన్నేమీ బాధించలేదు.

మంచంమీద పడుకుని సంతృప్తిగా నిట్టూర్చింది అన్నయ్య హృదయం తనకి తెలుసు. చిన్నతనంనించీ అన్నయ్య తన వెర్రిల్ని ఎన్నోసార్లు క్షమిస్తూ వచ్చాడు.

చిన్నతనంలో తను అన్నయ్య పుస్తకాలు చింపివేసేది. పెన్సిళ్ళు విరగకొట్టేది. అన్నయ్యకి కోపం వచ్చేది.

కోపంగా "చెల్లాయి" అని అరిచేవాడు. తను భయంతో ఒణికిపోతూ అమ్మదగ్గర దాక్కునేది

అన్నయ్య బెత్తం తీసుకుని వచ్చి "ఏంరా" అని కళ్ళెర్రచేసి పిలిచేవాడు.

తను అమ్మని కావలించుకునేది. అన్నయ్య "రమ్మంటే నీక్కాదూ? ఇలారా!" అనేవాడు.

అమ్మ "దాని ప్రాణాలు తీసేస్తావేమిట్రా"

# ★ సినీవాలి ★

అనేది. "నీకు తెలియదు వూరుకో అమ్మా" అని అమ్మని కసురుకొనేవాడు.

తన్ని చేయిపట్టుకుని గదిలోకి తీసుకెళ్ళి "వూ! చెప్పు. నా గదిలోకి వచ్చి యివన్నీ ఎందుకు పాడుచేశావ్. చెప్పు. చెప్పవేం?" అని బెత్తం ఎత్తేవాడు.

తను భయంతో బెదురుచూపులు చూసేది. అన్నయ్య చప్పున చేతిలో బెత్తం అవతలికి విసిరేసి తన్ను ఎత్తుకుని ముద్దుపెట్టుకునేవాడు.

"పోయి ఆడుకో. ఇంకెప్పుడూ యిలాంటి పాడు పనులు చేయకేం" అనేవాడు నవ్వుతూ.

తనూ అన్నయ్య మెడచుట్టూ చేతులు వేసి కిలకిలా నవ్వేది.

అప్పటిలాగే అన్నయ్య యిప్పుడూ తన్ను క్షమించాడు. అన్నయ్య ఏమీ మారలేదు. అప్పటి అన్నయ్యే. కాని తనే మారింది. అన్నయ్య ఆనాటి అన్నయ్యే. కాని తను మాత్రం ఆనాటి ముద్దులచెల్లెలు కాదు. ఆ పసితనపు నిర్మలత్వం ఈనాడు తన హృదయంలో ఏకోశానా లేదు.

రాధ యింక ఆలోచించలేకపోయింది. కాని ఆనాటి స్మృతులు రాధహృదయంలో మెదుల్తూనే వున్నాయి.

తన చిలిపితనం భరించలేక అమ్మ తన్ను కొట్టడానికి వచ్చేది.

తను పరిగెత్తుకుని అన్నయ్య దగ్గిరికి వెళ్ళేది. అన్నయ్య తన్ను దగ్గిరికి తీసుకునేవాడు.

అమ్మ కోపంతో మండిపడుతూ వచ్చేది. అన్నయ్య నవ్వుతూ "ఇంకెప్పుడూ చెయ్యదులే. ఈవేళకి వూరుకో అమ్మా!" అనేవాడు.

అమ్మ "నువ్విలా నెత్తి కెక్కించుకోబట్టే అదలా తయారయింది. వదులు. దాని సంగతేవిటో యివేళ తేలుస్తాను" అనేది కోపంతో.

అన్నయ్య అడిగేవాడు "దాన్ని కొడితే కాని యీవేళ నీకోపం తీరదా అమ్మా?"

"దాని చర్మం వొలిచేదాకా నాకు కోపం పోదు" అనేది అమ్మ.

అన్నయ్య నవ్వుతూ "అయితే దాని బదులు నన్ను కొట్టుకో అమ్మా!" అనేవాడు.

అమ్మ మనస్సు కరిగిపోయేది. నవ్వుతూ "అయితే నీకొక్కడికేనా ఏవిట్రా చెల్లెలు వున్నది? ఇంతోటి చెల్లెలూనూ. బాగా దొరికార్రా మీ రిద్దరూనూ" అనేది.

అన్నయ్య తన తల నిమురుతూ ప్రేమతో అనేవాడు "అవునమ్మా! యిలాంటి చెల్లాయి నాకొక్కడికే వుంది" ఆనందంతో అమ్మ కళ్ళల్లో నీళ్ళు తిరిగేవి.

ఎలాంటి చెల్లాయి? అన్నయ్య గౌరవాన్నీ, ప్రతిష్ఠనీ మంటకలిపిన యిలాంటి చెల్లాయేనా? యిలాంటి చెల్లాయిని చూసేనా ఆనాడు అన్నయ్య మురిసిపోయింది?

ఛీ! ఆ అన్నయ్యకి చెల్లాయి అనిపించుకునే యోగ్యతలేదు తనకి. అన్నయ్యను అన్యాయంచేసి తను యింకా ఎలా జీవించి వుండగలిగింది?

అన్నయ్య ఇప్పుడు ఏం చేస్తున్నాడో?

.....................

అన్నయ్య రాధనుగురించే ఆలోచిస్తున్నాడు. రాధ అలా ఎందుకు వెళ్ళిపోయింది? తను ప్రాణపదంగా చూసుకునే చెల్లాయి తన్ను విడిచి ఎందుకు వెళ్ళిపోయింది?

అమ్మ, నాన్నగారు చచ్చిపోయినా ఆ లోటు కనిపించకుండా తన చేతులతో ఎంతో అపురూపంగా పెంచాడు.

తన తాహతుకు మించినదే అయినా ఎంతో కష్టపడి పెద్ద సంబంధమే తీసుకుని వచ్చి పెళ్ళి చేశాడు.

ఆరోజుల్లో అందరూ తన్ని అభినందించారు. అప్పగింతల రోజున ఆడదానిలాగే భోరున ఏడ్చాడు.

ఎప్పుడూ తన కళ్ళఎదుట తిరిగే చెల్లాయి వెళ్ళిపోతుందన్నప్పుడు తన సర్వస్వాన్నీ పోగొట్టుకొన్నవానిలాగే బాధ పడ్డాడు.

అయినా ఆమె పెద్దయింటికి వెళుతోందన్న ఆనందం తన బాధని మరచిపోయేటట్టే చేసింది.

కాని, ఆ ఆనందం ఆట్టేకాలం నిలవలేదు. ఆరునెలల్లోనే ఆమె తిరిగి తనయింటికి వచ్చి వేసింది. వచ్చేటప్పుడు తన మాంగల్యాన్నీ, సౌభాగ్యాన్నీ తుడిచి పెట్టుకుని మరీ వచ్చింది.

పసితనంలో ఆమెకి కలిగిన దౌర్భాగ్యాన్ని తలుచుకొని కుమిలికుమిలి ఏడ్చాడు.

ఆమె వైధవ్యం తలుచుకొన్నప్పుడల్లా అతని గుండె తరుక్కుపోయేది.




'బ్రోంకైటిస్ మూలంగా
నా శ్వాసకోశాలలో
మంట పుట్టింది'

కాని పెప్స్

శ్వాసబాధను, మంటను వెంటనే
నివారించినవి





పెప్స్ టేబ్లెట్లు గొంతు, రొమ్ము బారోపశమన, నివారకసారములు కలవి, మీరు పెప్స్‌ను చప్పరించునపుడు ఈ సారములు ఆవిరి ఆయి, మీ శ్వాసద్వారా గొంతుక, శ్వాసమార్గంగుండా, శ్వాస కోశాలకు కొనిపోబడుతాయి. ఇలా అవి సరాసరి మిమ్ము బాధించే భాగాలను చేరుకుంటాయి అందుకే పెప్స్ అంతశక్తివంతమై, జగద్విఖ్యాతి గాంచినవి. పెప్స్ దగ్గులను అణిచివేస్తాయి, గొంతు పుండు బాధను ఉపశమింప జేస్తాయి, కఫమును కోసివేసి, శ్వాసబాధను పోగొట్టుతాయి. ఇన్‌ఫ్లుయెంజా, బ్రోంకైటిస్ చికిత్సకు ఇవి అమోఘమైనవి.

**PEPS**

పెప్స్ గొంతు, రొమ్ము టేబ్లెట్లు.
మందులమ్మేవారి అందరివద్దా లభిస్తాయి

సోల్ ఏజెంట్లు: దాదా & కో; 86, నైనప్పనాయక్ వీధి, మద్రాసు-1.



చార్మినార్

—ఫొటో: వి. గోపాలకృష్ణన్.

ఆమె మనస్సు ఎక్కడ నొచ్చుకుంటుందోనని ఎంతో ప్రేమతో చూసేవాడు.

ఆడబిడ్డంతే కళ్ళల్లో నిప్పులు పోసుకునే తన భార్యనుకూడా ఆమెజోలికి పోనిచ్చేవాడుకాదు,

తను యింతచేసినా ఆమె తన్నువిడిచి ఎందుకు వెళ్ళిపోయింది?

తన చెల్లాయి చేసినపనికి తను వూళ్ళో తలెత్తుకోని తిరుగలేకపోయాడు.

ఆమె చేసిన పని ఎలాంటిదయినా తను మాత్రం ఆమెను మనస్ఫూర్తిగా క్షమించాడు. ఆమెతప్పు క్షమించరానిదే కావచ్చు. అసామాన్యమైనది మాత్రం కాదు.

ఆమె తనకి అన్యాయం చేసి వెళ్ళిపోయింది. కాని, భగవంతుడు ఆమెని అన్యాయం చేశాడు.

వయసులో వుండే కోర్కెల్నీ, వాంఛల్నీ అణచుకోలేక క్షణిక దౌర్బల్యానికి లొంగిపోయింది.

తన నిర్మలత్వాన్నీ, చరిత్రనీ కళంకితం చేసుకుంది.

అన్నివిధాల భ్రష్టురాలయినతర్వాత మళ్ళీ తన దగ్గిరికి వచ్చింది.

ఈ స్థితిలో ఆమెను దిక్కులేనిదానిలా ఇంటినుండి ఎలా వెళ్ళగొట్టగలడు?

మరొకరైతే అలా చెయ్యగలరేమో! తన చేతుల్లో పెంచిన చెల్లెల్ని తను మాత్రం దిక్కులేనిదానిలా బైటికి వెళ్ళగొట్టలేడు.

పతితయైన తన చెల్లెల్ని తను చేరదీసి ఆదరిస్తాడు. ఎవరేమనుకున్నా తనకేమీ లెక్కలేదు.

ఏ సంకోచంవల్ల కొద్దిసేపటి క్రింద రాధని పలకరించలేకపోయాడో ఆ సంకోచము ఇప్పుడు అతనిహృదయంలో లేదు.

కలవరపడే ఆమె మనస్సుకి అభయమిచ్చి ఊరట కలిగించాలి.

అతను మంచం దిగి చెల్లెలు గదివైపు వెళ్ళాడు. దగ్గరగా వేసివున్న తలుపులు త్రోసుకుని లోపలికి వెళ్లాడు.

"చెల్లాయి" మృదువుగా ప్రేమ వుట్టిపడుతూ పిలిచాడు. కాని రాధ ఆ గదిలో లేదు.

అతను భయంతో వణికిపోయాడు.

"చెల్లాయి" బిగ్గరగా పిలిచాడు. రాధ పలకలేదు. ఎక్కడకు వెళ్ళింది?

ఆతురతతో బయటికివచ్చి చూశాడు. రాధ కనిపించలేదు. అతను నిస్పృహతో లోపలికి వచ్చాడు.

చెల్లాయి లేదు. మళ్ళీ వెళ్ళిపోయింది. ఇక తిరిగిరాదు.

ఆమె వెళ్ళిపోవటానికి కారణం తనే. ఆమెను తను సరిగా పలకరించలేదు. అందుకనే వెళ్ళిపోయింది.

దుఃఖంతో మంచంమీద కూలబడిపోయాడు. మంచంమీద ఏదో కాగితం కనిపించింది. వణుకుతున్న చేతులతో దాన్ని తీసుకుని చదువుతున్నాడు.

రాధ వ్రాసింది.

"అన్నయ్యా!,

నన్ను క్షమించావు. నాకంతే చాలు. యీ పాపిష్టిదానికి యింక ఏ ఆశా లేదు. నన్ను క్షమించి నీ ఉదారతని మరోసారి నిరూపించుకున్నావు.

కాని, నీ చెల్లెల్నని పించుకునే యోగ్యత యీ దౌర్భాగ్యురాలికి లేదు. నేను వెళ్ళిపోతున్నాను. నీ చెల్లెలివలన నీకు కల్గిన అప్రతిష్టను నీ చెల్లెలితోనే నాశనం కానీ. నేను ఇంకా వుండి దాన్ని పెంపొందించటం ఇష్టంలేదు. అందువల్లనే వెళ్ళిపోతున్నాను.

జన్మంటూ వుంటే మళ్ళీ నీకు చెల్లెలుగానే జన్మించాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నాను. శెలవు. —రాధ."

సజలనేత్రాలకు కాగితంలోని అక్షరాలు అలికిపోయినట్లు అగుపించాయి. గద్గదకంఠంనుంచి "చెల్లాయి" అన్న పిలుపు పైకి రాలేక హృదయంలోనే ఉండిపోయింది.

★